క్లుప్తంగా

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 3వ తేదీ ఒంగోలు రానున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక కొత్తపట్నం రోడ్డులోని ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తారు. 12.30 గంటలకు కరవది సహకార సంఘ అధ్యక్షుడు వాకా కృష్ణారెడ్డి తల్లి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొంటారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీఓ



వాకా కోటిరెడ్డిని కలిసిన ఎంపీడీఓ సుగుణమ్మ

మద్దిపాడు: మండల నూతన ఎంపీడీఓగా బాపట్ల జిల్లా నుంచి వచ్చిన టి.సుగుణమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ భర్త అయిన ఎంపీటీసీ వాకా కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. అనంతరం మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, నాయకులు విడివిడిగా ఎంపీడీఓను కలిసి అభినందనలు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకురావాలి

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు వర ప్రదాయిని అయిన వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురపాటి కుమారస్వామి కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొంతల కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు పాల్గొని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

శ్రీగిరిలో రేపు కూచిపూడి నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: ఆలూరు సీతారామమ్మ ఆరాధనోత్సవం సందర్భంగా మంగళంపల్లి అలేఖ్య ప్రభ ఆలూరు శ్రీనిధిలచే కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ఒంగోలు కొండ మీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు వెల్లడించారు. భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చీమకుర్తి ఎస్‌హెచ్‌ఓగా సీఐ దుర్గాప్రసాద్

- ఎస్సై హోదా నుంచి సీఐ హోదాకు అప్‌గ్రేడ్ అయిన చీమకుర్తి పోలీస్‌స్టేషన్



సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి: చీమకుర్తి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సీఐ దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలు పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి చీమకుర్తికి బదిలీపై వచ్చారు. గత నెల వరకు ఎస్సై హోదాతో ఉన్న చీమకుర్తి పోలీస్ స్టేషన్ ఇటీవల సీఐ హోదాకు అప్‌గ్రేడ్ కావడంతో ఎస్‌హెచ్‌ఓగా సీఐ దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా ఒంగోలులో ఎస్పీ మలికాగర్గ్‌ని కలిసినట్లు సీఐ తెలిపారు.

రేపు ధ్యాన శిక్షణ

కొమరోలు: స్థానిక రాజుగారికోటలో ఉన్న శివసాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో 3వ తేదీన ఉచిత ధ్యాన శిక్షణ, ధ్యానబోధ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పిరమిడ్ ధ్యానమందిర నిర్వాహకులు పొట్టి సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ధ్యానశిక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి సీనియర్ పిరమిడ్ మాస్టర్ సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ధ్యానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

13 మందికి కంటి శస్త్ర చికిత్సలు

పెద్దదోర్నాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు నిర్ధారించారు. రోగులను గుంటూరు జిల్లా పెదకాకాని శంకరా కంటి వైద్యశాలకు తరలించారు. శస్త్ర చికిత్స చేయడంతో పాటు వారికి అవసరమైన కళ్లజోళ్లను సైతం అందజేయనున్నట్లు అప్తమాలిక్ అసిస్టెంట్ కవిత పేర్కొన్నారు. డాక్టర్ మెర్సీ ప్రియాంక, ఆరోగ్య మిత్ర మందగిరి చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశ వర్కర్ మేరమ్మ, కాశింబీ పాల్గొన్నారు.

జేసీ సేవలు ప్రశంసనీయం

- వీడ్కోలు సభలో కలెక్టర్ దినేష్‌కుమార్
- నూతన జేసీ గోపాలకృష్ణకు ఘన స్వాగతం



కలెక్టర్‌గా బదిలీ అయిన జేసీ శ్రీనివాసులును సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, నూతన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డాక్టర్ కె.శ్రీనివాసులు అందించిన సేవలు, విధుల్లో పారదర్శకత ప్రశంసనీయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ నంద్యాల కలెక్టర్‌గా బదిలీ అయిన శ్రీనివాసులుకు ఆత్మీయ వీడ్కోలుతో పాటు కొత్తగా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోణంకి గోపాలకృష్ణకు స్వాగత కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం నిర్వహించింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ దినేష్‌కుమార్ హాజరై ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్‌గా శ్రీనివాసులు అందించిన సేవలను కొనియాడారు. ఏ పని అయినా సకాలంలో పూర్తి చేయాలనే దృక్పథంతో ఆయన ఉంటారన్నారు. పక్కా ప్రణాళికతో పనిచేయడం ఆయన్ను చూసి నేర్చుకోవాలన్నారు. ఏ అంశాన్ని అయినా క్షుణ్ణంగా అధ్యయనం చేసి దానిపై పూర్తి పట్టుతో విధులు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. జిల్లాలో కీలకమైన జాయింట్ కలెక్టర్ పోస్టును విజయవంతంగా నిర్వహించారని, ఇదే స్ఫూర్తితో కలెక్టర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. బదిలీపై వెళ్లిన కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా 10 నెలల పాటు జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించానని, కలెక్టర్ సూచనలు, జిల్లా అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయిన శ్రీనివాసులు స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని ఇద్దరు ఐఏఎస్‌లను ఘనంగా సత్కరించారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వాలీబాల్ మ్యాచ్‌లో తలపడుతున్న కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల బాలికల జట్లు



తలపడుతున్న మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాల బాలుర జట్లు

ఒంగోలు: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక మినీ స్టేడియంతో పాటు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన గురువారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలు జరగ్గా వాటిలో పురుషులు, స్త్రీల క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. కబడ్డీ మహిళల విభాగంలో కొండపి–మార్కాపురం జట్ల మధ్య తుది పోరు జరగాల్సి ఉంది. మూడో స్థానంలో ఒంగోలు నియోజకవర్గ జట్టు నిలిచింది. పురుషుల వాలీబాల్‌లో గిద్దలూరు– ఒంగోలు జట్ల మధ్య తుదిపోరు జరగాల్సి ఉంది. మూడో స్థానంలో కొండపి జట్టు నిలిచింది. మహిళల వాలీబాల్ విభాగంలో కొండపి జట్టు విజేతగా నిలవగా సంతనూతలపాడు జట్టు ద్వితీయస్థానంలో, వై.పాలెం జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. శుక్రవారం క్రికెట్ సెమీఫైనల్స్, ఫైనల్స్‌తో పాటు మూడో స్థానంలో జట్లను ఖరారు చేయనున్నారు. కబడ్డీ పురుషుల విభాగంలో ఒంగోలు– మార్కాపురం జట్ల మధ్య తుది పోరు, సంతనూతలపాడు–గిద్దలూరు జట్ల మధ్య మూడో స్థానం కోసం పోటీ జరగనుంది. మహిళల కబడ్డీ విభాగంలో కొండపి–మార్కాపురం జట్ల మధ్య తుదిపోరు నిర్వహిస్తారు. వాలీబాల్ పురుషుల విభాగంలో గిద్దలూరు–ఒంగోలు జట్ల మధ్య తుదిపోరు నిర్వహించడంతో పాటు బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను ప్రారంభించనున్నారు. శుక్రవారం సాయంత్రానికి పోటీలను ముగించే విధంగా జిల్లా క్రీడాశాఖ అధికారి, క్రీడల సమన్వయ వ్యాయామ ఉపాధ్యాయులు శీనయ్యలు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన జట్లు ఈనెల 5వ తేదీనుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 4వ తేదీ ఒంగోలు నుంచి బయల్దేరనున్నాయి.



వాలీబాల్ మ్యాచ్‌లో తలపడుతున్న కొండపి, గిద్దలూరు నియోజకవర్గాల బాలుర జట్లు



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న కొండపి, యర్రగొండపాలెం నియోజకవర్గాల బాలికల జట్లు

ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు



ఎంపీడీవో సుజాత, సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొత్తపట్నం: ప్రజలతో మమేకమై ప్రజా సేవకు అంకితమైన అధికారి ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అని ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య కొనియాడారు. నెల్లూరు జిల్లా కొండాపురం మండలానికి బదిలీ అయిన సుజాతకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో సుజాత, ఆమె భర్త సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ 5 సంవత్సరాల 10 నెలల పాటు మండలంలో ప్రజలకు ఎన్నో సేవలను ఎంపీడీవోగా సుజాత అందించారని తెలిపారు. ఆమె చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమని తెలిపారు. పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించడం, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషించి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. సుజాత మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలంతా తనకు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. ఒత్తిళ్లకు గురికాకుండా తన వెంట నడిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నజ్యోత్స్న, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

41 మద్యం సీసాలు స్వాధీనం



గుడ్లూరు పీఎస్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గుడ్లూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను గుడ్లూరు, తెట్టు గ్రామాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారావు తెలిపిన వివరాలు ప్రకారం ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామానికి చెందిన విష్ణు బుధవారం రాత్రి గుడ్లూరు మద్యం దుకాణంలో అక్రమంగా మద్యం సీసాలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు తన సిబ్బందితో సినిమాహాలు సెంటర్‌లో విష్ణును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తెట్టు గ్రామంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ గురువారం తెలిపారు.

వైఎస్సార్ ఆసరాను జయప్రదం చేయండి

కురిచేడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం జరిగే వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. గురువారం ఆయన స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు హాజరవుతున్నారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, కురిచేడు సొసైటీ మాజీ ప్రెసిడెంట్లు మేరువ పిచ్చిరెడ్డి, గోగులముడి లింగారెడ్డి, మాజీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎన్వీ నాగిరెడ్డి, నాయకులు ఏపీ సాంబయ్య, నారు శ్రీనివాసుల రెడ్డి, నుసుం సుబ్బారెడ్డి, బొరిగర్ల గోవిందు, పోకూరి సుబ్బారావు, నర్సింహారెడ్డి, సోమురాజు, రత్నం, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీఎం సైమన్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీపాతాళనాగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు, చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్యలు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. గురువారం ఆమె మండలంలోని సుద్దకురవ తండా పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు.

నేడు స్వామీ వివేకానంద జయంతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరం ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు రామకృష్ణ భక్త బృందం కార్యదర్శి పి.హనుమంతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్లుపల్లె శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాశిరెడ్డి తెలిపారు.

3, 4 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

పెద్దదోర్నాల: అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ మహాసభలు ఈ నెల 3,4 తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో జరుగుతాయని ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు గుండారెడ్డి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

కనిగిరి సీఐగా దాసరి వెంకటేశ్వరరావు

కనిగిరి రూరల్: కనిగిరి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దాసరి వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసి శివరామకృష్ణారెడ్డి అద్దంకి రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ దాసరి వెంకటేశ్వరరావును సర్కిల్ పరిధిలోని ఎస్సైలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ దాసరి వెంకటేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు శాంతియుతమైన వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మార్కాపురం డీఎస్పీగా బాలసుందర్‌రావు

మార్కాపురం టౌన్: మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.బాలసుందరరావు నియమితులయ్యారు. పట్టణ ఎస్సైగా అబ్దుల్ రెహమాన్‌ను నియమించారు.

శాటిలైట్ డిజైనింగ్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ సైంటిస్ట్ సుబ్బారెడ్డి

ఒంగోలు: శాటిలైట్ డిజైనింగ్, లాంచింగ్ సిస్టంపై స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ సైంటిస్ట్, షార్ ఫార్మర్ అసోసియేట్ డైరెక్టర్ టి.సుబ్బారెడ్డి పాల్గొని బీటెక్ ఈసీఈ, ట్రిపుల్‌ఈ, మెకానికల్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు శాటిలైట్ డిజైన్ ప్రాముఖ్యత, డ్రోన్ కమ్యూనికేషన్, విద్యుత్ లైన్ల పర్యవేక్షణ, జీపీఎస్ వాతావరణ సూచన, నేవిగేషన్, శాటిలైట్ ఫోన్, సైనిక ఉపగ్రహం, ఉపగ్రహ ఇంటర్నెట్ వంటి అంశాల గురించి వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

సమతుల్యంగా కేంద్ర బడ్జెట్

- ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్ సమతుల్య కేంద్ర బడ్జెట్ అని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. అన్ని శాఖలకు సముచిత కేటాయింపులు జరిగాయన్నారు. రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి వడ్డీ రహిత రుణాల కేటాయింపు, 1.04 కోట్ల మందికి నైపుణ్యాభివృద్ధికి శిక్షణ, యువత కోసం కార్పస్ ఫండ్, పీఎం ఆవాస్ యోజన పథకం కింద 3 కోట్ల గృహాల నిర్మాణం, ట్యాక్సు శ్లాబులు, ఎగుమతి, దిగుమతి సుంకాలలో మార్పు లేకపోవడం, 149 నూతన విమానాశ్రయాల నిర్మాణం, 3 అతి పెద్ద రైల్వే కారిడార్ల ఏర్పాటు, వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల పెంపుదల, మార్కెట్‌లోకి భారత్ రైస్ విడుదల, ఏడు లక్షల వరకు పన్ను మినహాయింపు, మరిన్ని నగరాలలో మెట్రో సర్వీసుల ఏర్పాటు, మరిన్ని మెడికల్ కాలేజీల ఏర్పాటు, 5 సమీకృత ఆక్వా పార్కులు, వచ్చే 5 సంవత్సరాలలో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం, అన్నదాతలకు 11.80 కోట్ల ఆర్థిక సాయం, 4 కోట్ల మంది రైతులకు పంటల బీమా ఏర్పాటు వంటివి చెప్పుకోదగిన అంశాలుగా పేర్కొన్నారు. విభజనతో ఆర్థిక లోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా అన్ని విషయాలలో తప్పక న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి



డీఆర్‌ఓ శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఒంగోలు అర్బన్: మున్సిపల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పీఆర్సీ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ శ్రీలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీని విస్మరించారు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆంధ్రరాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించారని సీపీఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు, పోలవరం, రాజధాని నిర్మాణం, మంజూరైన కేంద్ర సంస్థల పూర్తి, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాలపై కనీస ప్రస్తావన చేయలేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేస్తామని చెప్పలేదన్నారు. ప్రకటించిన ఆక్వాహబ్‌లలో ఆంధ్రాకు కేటాయించలేదన్నారు. ప్రకాశం జిల్లాలో నిర్మితమవుతున్న నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైను, ఇతర రైలు మార్గాల పూర్తికి నిధులు, కనిగిరి రిమ్స్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ప్రోత్సాహం ప్రకటించలేదన్నారు. రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీ ఊసే లేదన్నారు. ధరల పెరుగుదల నియంత్రణ, ఖాళీపోస్టుల భర్తీకి చర్యలు లేవన్నారు. బడ్జెట్‌లో 33 శాతం డబ్బు తెచ్చిన అప్పులపై వడ్డీ చెల్లింపులకు సరిపోతుందన్నారు. మౌలిక రంగాలైన విద్య, వైద్యానికి కేటాయింపులు తగ్గిపోయాయన్నారు. మొత్తంగా పేదలు, సామాన్యులు, దిగువ మధ్య తరగతి ప్రజానీకాన్ని నిరుత్సాహపరిచారన్నారు.

ఘనంగా ప్రసన్న చెన్నకేశవస్వామి కల్యాణం



కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో చిత్తా నక్షత్రం సందర్భంగా గురువారం రాత్రి ఏడు గంటల నుంచి స్వామివారి మాస కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శర్మ అవధాని, రమానాథాచార్యులు, నాగార్జునదేవ్ శ్రీధర్, రాంబాబు ఈ క్రతువును కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణ అధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

687 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

యర్రగొండపాలెం: స్థానిక హాస్టల్స్‌లో ఉన్న 687 మంది విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.కోటానాయక్, షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో సిబ్బంది సికిల్‌సెల్ (రక్తహీనత) పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాల హాస్టల్‌లో 350 మందికి, మినీ గురుకుల పాఠశాల హాస్టల్‌లో 105 మందికి, కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌లో 232 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆయా వైద్య పరీక్షల్లో పీహెచ్‌సీ సిబ్బంది శంకర్‌నాయక్, శివనాగమణి, ఆవులయ్య, ప్రమీల, నాగలక్ష్మి, కుమారి, రమ్యమానస, పద్మావతి, రహిమున్నీసా, లక్ష్మీబాయి, రేణుక, స్వప్న, స్వర్ణలత, వెంకటరమణ, జయ, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

71 మంది కుష్టురోగుల గుర్తింపు

కురిచేడు: గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు నియోజకవర్గంలో ఇంటింటి సర్వే నిర్వహించి 71 మంది కుష్టురోగులను గుర్తించినట్లు డీపీఎంఓ ఎన్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో డిసెంబరు 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు గుర్తించిన కేసులను గురువారం పరిశీలించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని పొట్లపాడు, గంగదొనకొండ, పడమర గంగవరం, ఎస్‌ఎస్‌పీ అగ్రహారం, బోధనంపాడు గ్రామాల్లో ఇంకా అనుమానంగా ఉన్న వారిని పరీక్షించారు. జిల్లాలో కొత్తగా నమోదైన కేసుల్లో దర్శి నియోజకవర్గంలో 60 శాతం కొత్త కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎటువంటి అనుమానం ఉన్నా డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎన్‌వీ సుబ్బారెడ్డి 94402 66251 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.